ప్రారంభోత్సవానికి ముస్తాబు

● రూ.1.16 కోట్లతో ప్రభుత్వ భవనాల నిర్మాణం ● నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: ఇక నుంచి ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట అందనున్నాయి.

అరకొర వసతులు వీడి సొంత భవనాల్లో ఇక ముందు ప్రభుత్వ కార్యకలాపాలు సాగనున్నాయి. ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి తేవాలనే సంకల్పం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కృషితో నేడు నెరవేరుతోంది. రూ.కోటికి పైగా నిధులతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి.

రూ.1.16 కోట్ల నిధులతో..

గంగూరు గ్రామంలో రూ 1.16 కోట్లతో నిర్మాణం చేసిన ప్రభుత్వ సముదాయాలు, రోడ్డు, మంచినీటి పైప్‌లైన్ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. గతంలో గంగూరు గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరినా అప్పటి టీడీపీ పాలకుల సహకారం లేక పోవటంతో భవన నిర్మాణం చేయలేదు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పడ్డాయి.



గంగూరులో నిర్మించిన సచివాలయ భవనం



రైతుభరోసా కేంద్రం



వైఎస్సార్ వెల్‌నెస్ క్లినిక్

ప్రభుత్వ భవనాలు ఇవీ..

గ్రామంలో ప్రభుత్వ సముదాయాలు ఒకే ప్రాంగణంలో నిర్మాణం చేశారు. సచివాలయం వన్ భవనం రూ.48 లక్షలు, రైతు భరోసా కేంద్రం భవనం రూ.29 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనం రూ 27 లక్షలతో నిర్మాణం చేశారు. ప్రభుత్వ సముదాయాలకు గ్రామస్తులు రావటానికి రూ.11 లక్షలతో రోడ్డు, తాగునీరుకు రూ.లక్షతో పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. గ్రామంలో అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో ఉండే విధంగా భవనాల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు.

నేడు ప్రారంభం..

గ్రామంలో నిర్మాణం చేసిన ప్రభుత్వ భవనాలను గురువారం ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ నాయకురాలు, గంగూరు గ్రామ సర్పంచి తస్లీ మున్నీసా తెలిపారు. ఆమె బుధవానం మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు భవనాలను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభిస్తారన్నారు. గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

కోడి పందేలు అరికట్టేందుకు కమిటీల ఏర్పాటు

విజయవాడ రూరల్: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో కోడిపందేలు అరికట్టేందుకు మండల స్థాయి కమిటీ ఏర్పాటయింది. మండల తహసీల్దార్ బి.సాయిశ్రీనివాసనాయక్, ఎంపీడీఓ బి.భార్గవి, ఇబ్రహీంపట్నం, టూటౌన్, భవానీపురం, పటమట నున్న రూరల్, పోలీసు స్టేషన్ల నుంచి సీఐలు, పశుసంవర్థకశాఖ ఏడీ డి.రాజశేఖర్, ఈఓపీఆర్డీ బీవీ శేషగిరిరావు కమిటీలో ఉంటారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేశామని తహసీల్దార్ బి.సాయిశ్రీనివాసనాయక్ చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శిలతో కమిటీలు పనిచేస్తాయన్నారు.

కోడిపందేల నిర్వాహకులపై కేసు

పెనమలూరు: కోడిపందేల నిర్వాహకులు నలుగురుపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్, అంగ్రాజు ఇస్రాయేలు, షేక్ మస్తాన్‌వలీ, షేక్ బాజీపై బైండోవర్ కేసు నమోదు చేశారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

పెనమలూరు: పెనమలూరు వికాస్ మోడల్ స్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లులు, పతంగుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ చిగురుపాటి వివేకానంద, నాగరాణి, ఉపాధ్యాయులు పి.రాజేష్ పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని కానుమోలు, వీరవల్లి జెడ్పీ హైస్కూళ్లలో బుధవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు సందడిగా జరిగాయి. విశ్రాంత ల్యాబ్ అసిస్టెంట్ క్లోపల్లి నారాయణరావు ఐదేళ్లుగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపికతో పాటుగా గిఫ్టులను అందించారు. జెడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలు ఎస్.లూథర్‌పాల్, నిర్మల, విశ్రాంత పీఈటీ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: యువత చెడు వైపు వెళ్లకుండా కబడ్డీ, వాలీబాల్ వంటి ఆటల పోటీలతో సంక్రాంతి సంబరాలుచేసుకోవాలనిఉంగుటూరు ఎస్ఐ రాజు అన్నారు. ముక్కపాడు సచివాలయం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు, ఈవోపీఆర్డీ బాషా, కార్యదర్శులు కృపాకుమార్, ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో సంక్రాంతి పండుగ సంబరాలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ప్రాంగణంలో విద్యార్థినులు రంగవల్లులు, గొబ్బెలు, చెరకు తోరణాలతో విశేషంగా అలంకరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఉపాధ్యాయులు చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీస్సులు అందించారు. భోగి మంటలు అంటించారు. సంక్రాంతి పర్వదినం విశిష్టతను భావితరాలకు తెలియజేయటానికి ఈ వేడుకలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొమరవల్లి థామస్ పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో సంక్రాంతి పండుగను నిర్వహించి తల్లిదండ్రులతో విద్యార్థులకు భోగి పండ్లు పోయించారు. ఆవరణలో రంగవల్లులు పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ షేక్ ఇమాం, ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా విజేతలకు, ఉపాధ్యాయులకు బహుమానాలు అందజేశారు.

కంకిపాడు: మండలంలో ఈడుపుగల్లు గ్రామంలోని శ్రీ విద్యాలయ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు అభయ కౌన్సిలింగ్ సెంటర్ సీఈఓ బి.రవికుమార్, పాఠశాల కరస్పాండెంట్ యార్లగడ్డ విజయ్‌కుమార్, ప్రిన్సిపల్ శిరీష బహుమతులు అందించారు. నెప్పల్లి జెడ్పీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రీటింగ్ కార్డుల తయారీలో చిన్నారులు పాల్గొని ప్రతిభ చాటారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మండవ శ్రీనివాస్, సుబ్రమణ్యం, తల్లమ్మతల్లి, వినయ్ పర్యవేక్షించారు.

రేపు సంక్రాంతి ముగ్గుల పోటీలు

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం అభయాంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 13న సంప్రదాయ సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో 13వ తేదీ సాయంత్రం 5 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. సంప్రదాయ చుక్కల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని, ఔత్సాహిక మహిళలు పాల్గొనాలని కోరారు.

ఉయ్యూరు: పట్టణంలోని ఏజీఅండ్ఎస్‌జీ పాఠశాలలో కంకిపాడు పోలీసు సర్కిల్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, ఆటల పోటీలు, రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, పిండివంటలు, పల్లెవాతావరణం, సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. గన్నవరం డీఎస్పీ కైలే విజయపాల్ సంబరాలను తిలకించి విజేతలకు బహుమతులు అందించారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కంకిపాడు సీఐ ఎస్.పరమేశ్వర్, ఎస్ఐ వీరప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు. పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను స్కూల్ డైరెక్టర్ ఎంకే బాబు పర్యవేక్షించారు.



నెప్పల్లి జెడ్పీ పాఠశాలలో విజేతలతో ఉపాధ్యాయులు



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న అధికారులు



కానుమోలు జెడ్పీ హైస్కూల్‌లో ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు



పెనమలూరులో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న చిన్నారులు



రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న తల్లులు

సంబరంగా సంక్రాంతి సాంస్కృతిక వైభవం

కంకిపాడు: సంక్రాంతి సాంస్కృతిక వైభవం సంబరంగా సాగింది. స్నేహాలయ ఆర్ట్స్ విజయవాడ, రావి నాంచారయ్య ట్రస్ట్, రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సంక్రాంతి సాంస్కృతిక వైభవం బుధవారం రాత్రి ఉత్సాహంగా జరిగింది. పలువురు సీనియర్ కళాకారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులకు సంక్రాంతి విశిష్ట పురస్కారాలను ప్రధానం చేశారు. అంతర్జాతీయ మిమిక్రీ కళాకారులు తోట సిల్వస్టర్, రంగస్థల కళాకారులు కళ్ల శ్రీనివాస్, కటికి కోటేశ్వరరావు, కొండవీటి పానకాలు, హార్మోనియం కళాకారులు టి.రాజబాబు, కుమారస్వామి, సామాజికవేత్త మాదు వసంతరావు, పాత్రికేయులు గుడిపాటి వెంకటేశ్వరరావు, వైద్యులు జేవీ. రమణమూర్తిరాజు పురస్కారాలు అందుకున్నారు. సినీ సంభాషణల రచయిత బుర్రా సాయిమాధవ్‌ను ఘనంగా సత్కారించారు. బాలనాగమ్మ, సత్యహరిచంద్ర కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, నాంది అవార్డు గ్రహీత అచంట బాలాజీనాయుడు, డాక్టర్ పీవీఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక వైభవం కార్యక్రమాన్ని బొజ్జ గౌరిశంకర్, రవివెంకట్, డి.హనుమంతరావు పర్యవేక్షించారు.

ఘన విజయమే లక్ష్యంగా పనిచేయండి

రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

గన్నవరం: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఏబీ కన్వెన్షన్ హాలులో బుధవారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదును జమచేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఎన్‌టీఎస్ఎన్.రాజు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ సీట్లను గెలిపించి ప్రజలకు ఇంతగా మేలు చేస్తున్న జగనన్నకు కానుకగా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం మరో రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్‌తో కలిసి అయోధ్యరామిరెడ్డి గ్రామాల వారీగా అభిప్రాయాలను తీసుకున్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య అధ్యక్షతన నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామిరెడ్డి

70 మందికి వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రాంగణంలో నీవా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ, సెంటినీ హాస్పటల్స్ సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని బ్రాంచ్ మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్ ప్రారంభించారు. ఖాతాదారులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ శ్రీపతిరావు ఉచిత వైద్య సేవలు అందించారు. సుమారు 70 మంది ఖాతాదారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు ఎం.సావిత్రి, కౌశిక్, ప్రవీణ్, మానీష్, అఫ్రోజ్, రాము, దివ్య, రాంబాబు, బీఎస్ఏ వేగిరెడ్డి బాలాజీ, నీవా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధి తేజస్వి పాల్గొన్నారు.



ఖాతాదారులతో వైద్యులు, బ్యాంకు సిబ్బంది

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బుద్ధవరం-1 ఆర్‌బీకే పరిధిలోని పీఏసీఎస్ ద్వారా 751 మెట్రిక్ టన్నులకు గాను ఇప్పటికే 708.08 మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు పూర్తయ్యాయి. బుద్ధవరం-2 ద్వారా 751గాను 227.88, చిక్కవరం 1914కు మొత్తం కొనుగోళ్లు జరిగాయి. గన్నవరం-2 ఆర్‌బీకే ద్వారా 729కి 728.56, కేసరపల్లి-1లో 2548కి 2548, కొండపావులూరు 888కి 816, పురుషోత్తపట్నం 2135కి 2135, సావరగూడెం 2498కి 2497.52, తెంపల్లి 708కి 707.72, వెదురుపావులూరు 3612కు 3611, వీరపనేనిగూడెం-1లో 897కు 683, వీరపనేనిగూడెం-2లో 1146కు 1145.8 మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు జరిగాయని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు బుధవారం తెలిపారు.

మందులు కొని వచ్చేలోగా బైక్ మాయం

పెనమలూరు: కానూరులో మెడికల్ షాపు ఎదురుగా ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..భవానిపురానికి చెందిన కే.వెంకటరంగ కుమార్ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతను కానూరు పంట కాలువ రోడ్డులో ఉన్న మెడికల్ షాపు వద్దకు వచ్చి బైక్ పార్కు చేసి మెడికల్ షాపులోకి వెళ్లి తిరిగి వచ్చే సరికి గుర్తుతెలియని వ్యక్తులు బైక్ చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు సంక్రాంతి సంబరాలు

నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండులో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో సంప్రదాయ బద్ధమైన ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్, వాలీబాల్, కబడ్డీ, టెన్నీకాయిట్, బాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తామన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల కార్యవర్గం



విజయవాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం, విజయవాడ సమితి యూనిట్ ఎన్నికలు బుధవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ సమావేశం మందిరంలో జరిగాయి. అధ్యక్షుడిగా కె.సాయిగోపాల్, ఉపాధ్యక్షుడిగా బి.విజయబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.షణ్ముఖా చారి, సంయుక్త కార్యదర్శిగా ఎం.ఝాన్సీలక్ష్మి, కోశాధికారిగా వి.ప్రభాకర్, జిల్లా కౌన్సిలర్-1గా వి.శ్యాంసన్‌బాబు, జిల్లా కౌన్సిలర్-2గా డీవీకిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు.

రబీ పంటల ఈ క్రాప్ నూరు శాతం పూర్తి చేయండి

ఏడీఏ సునీల్



గన్నవరం: రబీలో సాగు చేస్తున్న పంటల ఈ క్రాప్‌లో నమోదు నూరుశాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.సునీల్ వ్యవసాయ సహాయసంచాలకులను ఆదేశించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఈ క్రాప్ నమోదుపై గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ..ఈ క్రాప్ నమోదు చేసుకుంటేనే ఉచిత పంటల భీమా, పంట నష్ట పరిహారం తదితర పథకాలు వర్తిస్తాయని చెప్పారు. ఈ క్రాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రబీలో నూరు శాతం నమోదుకు కృషి చేయాలని సూచించారు. రబీలో చీడపీడల నివారణ కోసం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ద్వారా సస్యరక్షణ చర్యలు వివరించాలని చెప్పారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎస్ఎల్. తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే సాయం



గన్నవరం: కేసరపల్లి గ్రామానికి చెందిన నూతలపాటి సునీల్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అనగాని రవి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక చేతుల మీదుగా నగదును సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీల్‌కుమార్‌కు వైద్య సహాయం కోసం ఎమ్మెల్యేను సంప్రదించారని చెప్పారు. వెంటనే స్పందించిన వంశీమోహన్ ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీలు బొడ్డు అంజనేయవరప్రసాద్, మరీదు రాంబాబు, గ్రామ పార్టీ నాయకులు నీలం విజయకుమార్, దాసరి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు



పెనమలూరు: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కానూరులో బుధవారం విస్తృతంగా విజిలెన్స్ దాడులు నిర్వహించారు. గృహ విద్యుత్, వాణిజ్య సముదాయాల విద్యుత్ కనెక్షన్లను విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీ చేసింది. 30 బృందాలు విస్తృతంగా పర్యటించి 2391 గృహ విద్యుత్ సర్వీసులు, 137 వాణిజ్య సర్వీసులను పరిశీలించారు. 82 సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.3.22 లక్షలు జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు, పి.హరిబాబు అన్నారు. విద్యుత్ చౌర్యంపై 9440812362, 9440812363, 8331014951 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏడీలు ఎం.పూర్ణచంద్రరావు, ఎం.శివకుమార్, జే.బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు రూ.20 వేలు విలువైన భోజనం ప్లేట్లను బుధవారం సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్ పంపిణీ చేశారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ విజయవాడకు చెందిన దాతలు కడియాల సత్యనారాయణ, నాంచారమ్మ దంపతుల వితరణతో పాఠశాలకు భోజనం ప్లేట్లు సమకూరాయన్నారు. వసతులను వినియోగించుకుని, దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించాలని సూచించారు. ఉప సర్పంచ్ కంచర్ల వెంకటరావు (చిన్ని), మాజీ ఉప సర్పంచ్ కంచర్ల శేషగిరి, హెచ్‌ఎం ఎం.అరుణకుమారి, ఉపాధ్యాయులు సిహెచ్ సుశీల, ఎన్.శ్రీనివాసరావు, కె.విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



భోజనం ప్లేట్లు అందజేస్తున్న సర్పంచ్ సురేష్‌కుమార్, ఇతర ప్రతినిధులు

స్కూల్ స్థలాన్ని పరిశీలించిన జేసీ

నున్న(విజయవాడ రూరల్): ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్ (మైనార్టీ బాలికలు)కు ప్రభుత్వం కేటాయించిన నున్న గ్రామంలోని స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ బుధవారం పరిశీలించారు. సర్వే నంబర్లు 371/1లో ఎకరం 75 సెంట్లు, 371/3లో ఎకరం 75 సెంట్లు భూమిని ప్రభుత్వం కేటాయించగా ఆమె పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల్లో భూమి వివరాలను తహసీల్దారు బి.సాయిశ్రీనివాసనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. 2004వ సంవత్సరంలో ఈ భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసిందని వివరించారు. ఎంట్రన్స్ భూమి ఏమిటని గ్రామ సర్వేయర్‌ను జాయింట్ కలెక్టర్ అడిగారు. రైతుభరోసా కేంద్రం, వాటర్‌ట్యాంక్ కోసం కేటాయించిన గ్రామ పంచాయతి భూమిగా తెలిపారు. అనంతరం సర్వే నెంబరు 516లో మాజీ సర్పంచి భీమవరపు వెంకట్రామిరెడ్డికి చెందిన 2 ఎకరాల 52 సెంట్లు పొలం అడంగళ్‌లో నిషేధిత జాబితా (22/ఎ) లో వుందని, దాన్ని తొలగించాలని వచ్చిన దరఖాస్తు నేపథ్యంలో ఆ భూమిని కూడా జేసీ పరిశీలించారు. మండల సర్వేయర్ రమేష్, ఆర్ఐ రామ్‌సింగ్, వీఆర్వోలు బి.శంకర్, శ్రీనివాసరావు, చాంద్, విలేజి సర్వేయర్లు ఆమె వెంట ఉన్నారు.



ఏపీఆర్ స్కూల్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ నుపూర్ అజయ్

కోడి పందేల జోలికి పోవద్దు

ఉయ్యూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదం జరగకుండా అడ్డుకొనే చర్యలపై బుధవారం పోలీసు, మండల పరిషత్, పశుసంవర్థకశాఖలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మస్తాన్ మాట్లాడుతూ జూదం, కోడిపందేల జోలికి పోవద్దన్నారు. చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. పండుగను సంప్రదాయ క్రీడలతో ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ విమాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న ఉయ్యూరు తహసీల్దార్ మస్తాన్

దిశతో మహిళలకు భద్రత

పెనమలూరు: దిశ చట్టంతో మహిళలకు భద్రత లభిస్తుందని వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. తాడిగడప కార్మికనగర్ కమ్యూనిటీ హాల్‌లో దిశ యాప్ ప్రాముఖ్యతపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సీఐ గోవిందరాజు యాప్ ప్రాధాన్యత, మహిళలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. టీపీఓ పద్మావతి, ఆర్ఐ అలీషా, మహిళా పోలీసులు శృతి, రత్నకుమారి, మహ్మద్ ఇంతియాజ్ బేగం, సుమతి పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కంకిపాడుకు చెందిన నరహరిశెట్టి హేమలత, ఆమె కుమారుడు రాము నలంద స్కూల్ వద్దకు వచ్చారు. రోడ్డు దాటుతున్న సమయంలో కంకిపాడు నుంచి విజయవాడ వెళ్తున్న బైక్ హేమలతను ఢీకొనడంతో గాయాలు కాగా పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదా అమ్మవారికి సారె సమర్పణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలోని రామాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం 27వ రోజు కూడారై సందర్భంగా గోదాదేవి, రంగనాథుడికి మహిళలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన అడపా కాశీ అన్నపూర్ణ ఆధ్వర్యంలో గోదా అమ్మవారికి 108 గంగాళాలతో సారె సమర్పించారు. పాలపాంగళ్లు, చీర, గాజులు అమ్మవారిని సమర్పించి పూజలు నిర్వహించారు.